బీజేపీ జిల్లా అధ్యక్షుడి వ్యాఖ్యలపై దళిత సంఘాల నిరసన

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 10: బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్, ఆయన తనయుడు వంశీకృష్ణపై చేసిన వ్యాఖ్యలను దళిత సంఘాల నాయకులు ఖండించారు. బుధవారం మంచిర్యాలలోని అంబేద్కర్ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలను ధరించి వారు నిరసన తెలిపారు. బేషరతుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వివేక్ కుటుంబానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఎర్రోళ్ల నరేశ్, సొల్లు శ్రీనివాస్, సూర నాగబాబు, సాగె కృష్ణ, ఐత లింగమూర్తి, గంపల శంకర్, కాటం రాజు, ఎడ్ల సారయ్య, సుదమల్ల దామోదర్, వెంకటి, తాజ్‌బాబా, మద్దెల రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

జైపూర్‌లో..

జైపూర్, ఏప్రిల్ 10: కాకా కుటుంబంపై బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ వ్యాఖ్యలపై జై భీం సైనిక్‌దళ్ అధ్యక్షుడు శీలం వెంకటేశ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆ సంఘం నాయకులు నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలోనాయకులు మంతెన లక్ష్మణ్, జనంపెల్లి భానేశ్, బొజ్జ మల్లేశ్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

తాండూర్, ఏప్రిల్ 10 : మండలంలోని కాసిపేట-ద్వారకాపూర్ మాజీ సర్పంచ్ సాత బానయ్య అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి సంతాపం తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా తాగునీరందించాలి

- అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశం

నస్పూర్, ఏప్రిల్ 10 : మండుతున్న ఎండల దృష్ట్యా తాగునీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా నిరంతరాయంగా తాగునీరు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ నీటి సరఫరా కోసం మండల, గ్రామ, వార్డు స్థాయిల్లో ప్రత్యేక అధికారులను నియమించి అవసరమైన కార్యాచరణ రూపొందించాలన్నారు. నీరు సరఫరా చేయలేని ప్రాంతాలను గుర్తించి వాటర్ ట్యాంకర్ల ద్వారా అందించాలన్నారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి మున్సిపాలిటీల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతు సంక్షేమంలో భాగంగా మండలానికి 1 చొప్పున కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 7149 కేంద్రాలు ప్రారంభించాల్సి ఉండగా 6678 ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వడదెబ్బకు ప్రజలు గురి కాకుండా పలు చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి పనులు చేపట్టే ప్రాంతాల్లో కూలీలకు నీడ, తాగునీరు, ఓఆర్ఎస్, మెడికల్ కిట్‌లు ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించిన వడదెబ్బ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు, డీపీవో వెంకటేశ్వర్‌రావు, డీఈవో యాదయ్య, డీఆర్డీవో కిషన్, ముఖ్య ప్రణాళిక అధికారి సత్యం, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపాల్, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలును పకడ్బందీగా నిర్వహించాలి

ఆసిఫాబాద్ టౌన్,ఏప్రిల్ 10 : ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఇతర శాఖల కార్యదర్శులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పాఠశాలల మరమ్మతులు, తాగునీటి సరఫరా, అధిక ఉష్ణోగ్రతలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాల్లో కేటాయించిన మేరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, వేసవి దృష్ట్యా రైతులకు ఇబ్బంది కలగకుండా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్లు, అధికారులు

సింగరేణి

కార్మికులపై వేధింపులు మానుకోవాలి

మందమర్రి రూరల్,ఏప్రిల్ 10: మందమర్రి ఏరియాలోని సింగరేణి కార్మికులపై అధికారుల వేధింపులు మానుకోవాలని, లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పార్వతి రాజిరెడ్డి, ఆ సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెల్ది సుదర్శన్ అన్నారు. బుధవారం మందమర్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కేకే-5 గని ఆఫీస్ సూపరింటెండెంట్ మహిళా ఉద్యోగితో బూట్లు కడిగించుకున్నాడని ఆరోపించారు. అది మరువకముందే ఏరియాలోని కేకే.ఓసీ గనిలో జనరల్ మజ్దూర్ కార్మికుడిని పంపు డ్రైవర్ పనులకు వెళ్లలేనని చెప్పినా అధికారి వినకుండా ఆదేశించడంతో ఆ పనికి వెళ్లిన కార్మికుడు అస్వస్థతకు గురయ్యాడని తెలిపారు.

కార్మికులపై తేనెటీగల దాడి

కాసిపేట, ఏప్రిల్ 10 : మందమర్రి ఏరియాలోని కాసిపేట 2 ఇంక్లైన్ గనిలో కార్మికులపై తేనెటీగలు దాడి చేయడంతో ముగ్గురు కార్మికులకు గాయాలయ్యాయి. గని మేనేజర్ లక్ష్మీనారాయణను వివరాలు అడగగా, గనిపై కార్మికులు మస్టర్లు పడుతుండగా తేనెటీగల గుంపు ఒక్కసారిగా దాడి చేసిందని తెలిపారు. ముగ్గురు కార్మికులను కుట్టడంతో స్థానిక దవాఖానకు తరలించినట్లు వివరించారు.

పోరాట ఫలితమే బస్సు సౌకర్యం

రెబ్బెన, ఏప్రిల్ 10: ఏఐటీయూసీ పోరాట ఫలితంగానే గోలేటి ఎక్స్‌రోడ్డు నుంచి ఖైరిగూడ ఓసీపీ వరకు కార్మికులకు బస్సు సౌకర్యం ప్రారంభమైనట్లు ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి పేర్కొన్నారు. గోలేటి ఎక్స్‌రోడ్డు వద్ద బుధవారం బస్సు సౌకర్యం ప్రారంభించారు. జీఎం రవిప్రసాద్, పీవో సత్యనారాయణకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఖైరిగూడ ఓసీపీ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, జూపాక రాజేశ్, కిరణ్‌బాబు, సహాయ కార్యదర్శి ఒదేలు, సభ్యులు అన్నం రాజ్‌కుమార్, అల్లాడి కోటి, నరేశ్, రాజు, రవి, గణేశ్, సుధాకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి ప్రేరణ పోటీలు

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 10: గుజరాత్ లోని వాద్‌నగర్‌లో నిర్వహించబోయే 7 రోజుల శిక్షణ కార్యక్రమానికి జిల్లా నుంచి ఒక బాలుడు ఒక బాలికను ఎంపిక చేసే నిమిత్తం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవ పోటీలు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో బుధవారం విజయవంతంగా నిర్వహించారు. జిల్లా నుంచి 95 పాఠశాలల నుంచి 77 మంది బాలురు 102 మంది బాలికలు పాల్గొన్నారు. వ్యాసరచన, చిత్ర లేఖనం, డ్రాయింగ్, ఉపన్యాసం, నృత్యం, గానం మొదలైన అంశాల్లో పోటీలు నిర్వహించారు. మొత్తం 30 బాలబాలికలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమాలకు నోడల్ ఆఫీసర్‌గా మంచిర్యాల కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ జే.ప్రసాద్, సహాయంగా జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కో ఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి, న్యాయ నిర్ణేతలుగా ప్రధానోపాధ్యాయుల వ్యవహరించారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

కాసిపేట, ఏప్రిల్ 10 : కాసిపేట మండలంలోని ఆదివాసీ గ్రామాల భూ సమస్యలు పరిష్కరించాలని, ఏజెన్సీ ప్రాంతంలో నిబంధనల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో తహసీల్దార్ భోజన్నకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడె జంగు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం హన్మంతు, ఏఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ కిషన్, మండల గౌరవాధ్యక్షుడు ఆత్రం జంగు, మండల అధ్యక్షుడు సంద్ర భూమయ్య, ప్రధాన కార్యదర్శి కుర్సింగ తిరుపతి, ఉపాధ్యక్షుడు ఆత్రం మహేశ్, ఆత్రం అచ్యుతరావు, ఆత్రం మాన్కు, జుగున్నాక యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా పని చేస్తాం

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 10: పెరిక కుల సంఘం ఏ పార్టీకి సపోర్ట్ చేయదని, సభ్యులు నచ్చిన పార్టీకి ఓటు వేయవచ్చని పెరిక కులసంఘం జిల్లా అధ్యక్షుడు వీర సత్యనారాయణ అన్నారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కొన్ని పార్టీల నాయకులు పెరిక కులసంఘం పలానా పార్టీకి సపోర్ట్ చేస్తుందని ప్రకటించుకుంటున్నారని దాన్ని సంఘం తరపున ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ కీత విజయ్ కుమార్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల చంద్రశేఖర్, డాక్టర్ బొడ్డు రఘునందన్, మాజీ అధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, సందెల వెంకటేశ్, మోట పలుకుల తిరుపతి, మంచు శ్రీనివాస్, దుమ్మటి అర్జున్, కర్రె లచ్చన్న, కుంచాల శంకరయ్య, గోపతి లక్ష్మయ్య, అంకతి శ్రీకాంత్, ఎంబడి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఒడి సేవలు అభినందనీయం : ఏసీపీ

బెల్లంపల్లి, ఏప్రిల్ 10 : అమ్మ ఒడి ఎన్జీవో సేవలు అభినందనీయమని బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని సింగరేణి కళావేదికలో నిర్వహించిన అమ్మ ఒడి ఎన్జీవో అన్నదాత ప్రాజెక్ట్ నాలుగవ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మ ఒడి ఎన్జీవో వ్యవస్థాపకుడు అజ్మీరా మోహన్, రిటైర్డ్ హెచ్ఎం ముక్క రమేశ్‌తో కలిసి రాంజీ గోండు విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఒడి సభ్యులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ డిమాండ్ ఆమోదించాలి

కాగజ్‌నగర్, ఏప్రిల్ 10: సీనియర్ సిటిజన్స్ డిమాండ్ ఆమోదించే వారికే పార్లమెంట్ ఎన్నికల్లో తమ మద్దతు ఇస్తామని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, సంఘం ప్రతినిధులు నారాయణ, రమణయ్య, ఎల్లాగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. రాష్ట్ర సంఘం అధ్యక్షుడు నర్సింహారావు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఇటీవల రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. వయోధికులకు ప్రత్యేక శాఖ ఏర్పాటు, హైదరాబాద్‌లో భవనం కోసం రెండెకరాలు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో ఉచిత వైద్యం, మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ డే కేర్ సెంటర్, రైల్వే చార్జీల్లో రాయితీ, తల్లిదండ్రులు, వయోధికుల పోషణ సంక్షేమ చట్టం 2007నకు ప్రతిపాదించిన సవరణ బిల్లు 2019ని పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేశారు.

కుష్టు నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

రెబ్బెన, ఏప్రిల్ 10 : కుష్టు నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా లెప్రసీ అధికారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ పేర్కొన్నారు. రెబ్బెనలోని పీహెచ్‌సీలో బుధవారం అనుమానిత కుష్టు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పర్శ లేని మచ్చలు కలిగిన వారు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ సుజిత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, హెచ్‌ఈవో శ్యామ్‌లాల్, నోడల్ ఆఫీసర్ ప్రవీణ్, లెప్రో ఇండియా రాజేందర్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు

కోటపల్లి, ఫిబ్రవరి 10 : కోటపల్లి మండలంలోని పిన్నారంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి పనుల నిర్వహణలో అక్రమాలకు పాల్పడుతున్నాడని గ్రామస్తులు ఎంపీడీవో భూమయ్య, ఏపీవో బాలయ్యకు ఫిర్యాదు చేశారు. కూలీలు రాకపోయినా హాజరు వేస్తూ వారి బంధువుల పేరిట నిధులను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓటు హక్కు వినియోగం ప్రతి ఒక్కరి బాధ్యత

- కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 10 : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్స్ లో పోలీస్, పరిపాలన శాఖల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు, యువకులకు ఓటరు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. సమాజంలో మార్పు ఓటు హక్కు ద్వారా సాధ్యపడుతుందని, జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఓటర్ హెల్ప్‌లైన్, ఆన్‌లైన్‌లో ఎన్నికల సంఘం వెబ్‌సైట్ల ద్వారా ఓటరు జాబితాలో వివరాలు సరిచూసుకోవచ్చన్నారు. 18 సంవత్సరాల వయసు గల ప్రతి ఒక్కరూ ఈ నెల 15వ తేదీలోగా తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు వివిధ ప్రచార పద్ధతుల ద్వారా ప్రజలకు తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ సురేశ్‌కుమార్, జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) దాసరి వేణు, మండలాధికారి లోకేశ్వర్ రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, డీఎస్పీ సదయ్య, తహసీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్‌పాండే, సంబంధిత శాఖల అధికారులు, విద్యార్థులుపాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎస్పీ సురేశ్ కుమార్

ఎండలపై జాగ్రత్తలను వివరించాలి

వేసవికాలం నేపథ్యంలో వడదెబ్బ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు, బాధితులు పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండలంలోని అడ గ్రామంలో గల పీహెచ్‌సీని సందర్శించారు. వార్డులు, రిజిస్టర్లు, ప్రజలకు అందుతున్న సేవలు పరిశీలించారు. దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. సేవలలో ఏమైనా ఇబ్బంది ఉంటే వైద్యాధికారులకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై పర్యవేక్షణ

లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లాలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల్లో కల్పిస్తున్న సదుపాయాలపై యాప్ ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తాగునీరు, మూత్రశాలలు, ఇతర వసతుల కల్పనపై రూపొందించిన బీఎల్‌వో యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు, సూపర్ వైజర్లు, బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. వేసవి దృష్ట్యా అధిక ఉష్ణోగ్రత ఉన్నందున ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, దివ్యాంగ ఓటర్లను తరలించేందుకు వీల్ చైర్లు ఉంచాలని తెలిపారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు దాసరి వేణు, దీపక్ తివారీ, ఎస్పీ సురేశ్ కుమార్, డీఎస్పీ సదయ్య, ఆసిఫాబాద్ తహసీల్దార్ శ్రీనివాస్ రావు దేశపాండే పాల్గొన్నారు.

సీఎంఆర్ను పూర్తి చేయాలి

నస్పూర్, ఏప్రిల్ 10 : జిల్లాలో రైసుమిల్లులకు నిర్దేశించిన సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని భారత ఆహార సంస్థ గోదాంను అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపాల్‌తో కలిసి సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎంఆర్ ప్రక్రియలో భాగంగా రా రైసుమిల్లులు ప్రతి రోజూ 1 ఏసీకే , బాయిల్డ్ రైసు మిల్లులు 2ఏసీకే పూర్తి చేసేలా చర్యలు తీసుకొని లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. మంచిర్యాలలో ఎఫ్‌సీఐ గోదాంకు స్థలం కేటాయించకపోవడంతో బియ్యం దిగుమతిలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని రైసుమిల్లర్లు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కరీంనగర్ డివిజనల్ మేనేజర్‌తో మాట్లాడి వాగన్ మూమెంట్ త్వరగా చేపట్టి జిల్లాలోని మిల్లర్లు సీఎంఆర్ బియ్యం దిగుమతి పెరిగే విధంగా ఎఫ్‌సీఐలో స్థలం కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

కెరమెరి, ఏప్రిల్ 10 : వేసవి కాలంలో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చూడాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. బుధవారం ధనోర గ్రామంలోని నీటి శుద్ధీకరణ కేంద్రం, కేస్లాగూడలోని పంప్ హౌస్‌ను అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి పరిశీలించారు. నీటి శుద్ధి కేంద్రం పనితీరు, తాగునీరు సరఫరా చేస్తున్న ప్రాంతాల వివరాలను చిత్రపటంతో ఈఈ వెంకటపతి కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవికాలం ముగిసే వరకు సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫిల్టర్‌బెడ్, పంప్‌హౌస్‌లో విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చూడాలని ఆ శాఖ సబ్ ఇంజినీర్ రమేశ్‌కు సూచించారు. అవసరమైతే విద్యుత్ శాఖ నుంచి ఒక్కరిని అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఎక్కడైన పైపు లీకేజీలు ఉంటే వెంటనే గుర్తించి మరమ్మతులు చేయాలన్నారు. అనంతరం సాంగ్వి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల తరగతి గదుల్లో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్లు, శిథిలావస్థకు చేరిన గోడలకు మరమ్మతులు చేయాలని అధికారులకు సూచించారు. పాఠశాల చుట్టూ నీడనిచ్చే చెట్ల మొక్కలు నాటించి పర్యావరణాన్ని పరిరక్షించేలా చూడాలని తెలిపారు. మెనూ ప్రకారం భోజనం, గుణాత్మకమైన విద్యను అందిస్తూ ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జడ్పీసీఈవో అనిల్‌కుమార్, డీఈ రాకేశ్, ఏఈలు విశ్వేశ్వర్, సంతోష్, టీడీ బ్లూఏఈ నజీముద్దీన్, తహసీల్దార్ దత్తు ప్రసాద్, ఎంపీడీవో కృష్ణారావు, మండల నోడల్ అధికారి ప్రకాశ్, ఏవో గోపికాంత్, ఎల్ఐ రాజశేఖర్, ఎంపీవో మహ్మద్ అమ్జద్, మాజీ సర్పంచ్‌లు కుమ్రం గుణవంత్‌రావ్, జగన్నాథ్, నారాయణ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ -బైక్ ఢీ

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు

లక్షెట్టిపేట, ఏప్రిల్ 10: లక్షెట్టిపేటలోని హెచ్‌పీ పెట్రోల్‌బంక్ ఎదుట మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దండేపల్లి మండలం తాళ్లపేటకు చెందిన జెల్లపల్లి ప్రణయ్‌రాజ్(27) మృతి చెందాడు. మరొకరికి తీవ్రగాయాలై చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ చంద్రకుమార్ బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ప్రణయ్‌రాజ్, సాయి కుమార్ బైక్‌పై లక్షెట్టిపేటకు వచ్చి తిరిగి తాళ్లపేటకు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టిందన్నారు. ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అంబులెన్స్‌లో మంచిర్యాల దవాఖానకు తరలించారు. అప్పటికే ప్రణయ్‌రాజ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సాయికుమార్ చికిత్స పొందుతున్నాడు. మృతుడికి ఇంకా పెళ్లి కాలేదని తల్లి జెల్లపల్లి అల్పన ఫిర్యాదు మేరకు ఎస్ఐ-2 రామయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ దవాఖాన భవనం ఎక్కి వ్యక్తి హల్‌చల్

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 10: మంచిర్యాలలోని ప్రభుత్వ జనరల్ దవాఖాన భవనం ఎక్కి పట్టణానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రాజు ఆత్మహత్య చేసుకుంటానని హల్ చల్ చేసిన ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..రాజు కుటుంబ కలహాలతో గోడ్రెజ్ హెయిర్ డైను తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతని స్నేహితులు దవాఖానకు తీసుకువచ్చారు. చికిత్సకు నిరాకరించి భవనం పైకి ఎక్కి చనిపోతానంటూ హల్‌చల్ చేశాడు. అవుట్ పోస్ట్ పోలీసులు అక్కడికి వచ్చి నచ్చజెప్పడంతో కిందికి దిగివచ్చాడు.

మల్కేపల్లిలో ఇల్లు దగ్ధం

కాసిపేట, ఏప్రిల్ 10 : కాసిపేట మండలంలోని మల్కేపల్లిలో కుడిమేత కౌసల్య రాంచందర్ ఇల్లు షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. మంగళవారం రాత్రి అందరూ ఇంటి బయట నిద్రిస్తుండగా ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. టీవీ, ఫ్రిజ్, క్వింటాళ్ల బియ్యం, రూ.20 వేల నగదు, ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లు, సామగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఎంఆర్ఐ సులోచన పంచనామా నిర్వహించారు. తక్షణ సహాయం కింద 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, రూ.500 నగదును తహసీల్ కార్యాలయం నుంచి అందజేశారు.

కల్వర్టుల తనిఖీ

నెన్నెల, ఏప్రిల్10: ఎన్నికల నేపథ్యంలో మండలంలో పలు గ్రామాల్లో వెళ్లే ప్రధాన రోడ్లపై ఉన్న కల్వర్టులను బుధవారం బెల్లంపల్లి రూరల్ సీఐ అష్ణలుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసు బలగాలు తనిఖీ చేశాయి. నెన్నెల మండలంలోని మైలారం గ్రామస్తులకు ఎన్నికలకు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఎన్నికలకు సహకరించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై సమాచారం అందించాలన్నారు.

గంజాయి సేవిస్తూ..గొడవలు..

- పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులపై కాలనీవాసుల ఫిర్యాదు

బెల్లంపల్లి, ఏప్రిల్ 10 :ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదివే కొంత మంది విద్యార్థులు గంజాయి సేవిస్తూ గొడవలు చేస్తున్నారని కళాశాల పరిసర ప్రాంతంలోని ఇందిరమ్మ కా